రూ.15 వేలు ఇవ్వాల్సిందే..

రైతుభరోసాపై మోసంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కదం తొక్కిన బీఆర్ఎస్ శ్రేణులు

కాంగ్రెస్ అంటేనే మోసం, దగా అని మండిపాటు

వికారాబాద్ : ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

షాద్‌నగర్, జనవరి 6 : దేశ నాయకులతో పెద్ద, పెద్ద సభలు పెట్టించి రైతులకు ఎన్నో హామీలిచ్చారు. రాష్ట్రమంతా తిరిగి కనిపించిన దేవుళ్లపై ఒట్లు వేశారు. చివరకు రైతులను నట్టేట ముంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకుడు రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో రైతుభరోసా నిధుల కోతపై చేపట్టిన రైతు ధర్నాలో పలువురు నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. ఏడాదిగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరును చూసి ఆ పార్టీ నాయకులే నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వస్తేనే పథకాలు గుర్తుకు వస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీతో ఓట్లను దండుకున్న రేవంత్‌రెడ్డి.. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రైతుభరోసాను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ఇప్పటికీ వంద శాతం రుణమాఫీ అయిన గ్రామం ఒకటి కూడా లేదన్నారు. హామీల అమల్లో సర్కారు విఫలమైందన్నారు. వడ్లకు బోనస్ ధర లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. నాడు సీఎం కేసీఆర్ హయాంలో రైతులు సంతోషంగా ఉంటే నేడు రేవంత్‌రెడ్డి పాలనలో ఆందోళన స్థితిలో ఉన్నారని.. ఏ ఊర్లో చూసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పల్లె నర్సింగరావు, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, హఫీజ్, లక్ష్మణ్‌నాయక్, రవి, లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, విఠల్, బక్కన్నయాదవ్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, ఈశ్వర్, అంతయ్య, వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాణగౌడ్, రంగయ్య, వీరేశం, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

వికారాబాద్ : ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇచ్చి తీరాల్సిందేనని కౌన్సిలర్ గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ నివాసం నుంచి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వరకు శ్రేణులు ర్యాలీగా తరలివచ్చారు. చౌరస్తాలో ధర్నా నిర్వహించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎకరానికి రూ.15 వేల ఇస్తామని నమ్మించి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు నయీమ్, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, రామస్వామి, రాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, వికారాబాద్ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మైనారిటీ సెల్ మండలాధ్యక్షుడు గయాజ్, వికారాబాద్ పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మూర్తుజా అలీ, ఉపాధ్యక్షులు ఫరీద్, అఫ్జల్ పాషా, లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, మహిపాల్‌రెడ్డి, నర్సింహులు, రమణ, సురేశ్‌గౌడ్, సురేశ్, సుభాన్‌రెడ్డి, అనంతయ్య, మల్లికార్జున్, మల్లేశం, శివకుమార్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి నమ్మించి మోసం చేస్తున్నారు..

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి

బంట్వారం : అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు చెల్లించాలని రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు ఖాజాపాషా డిమాండ్ చేశారు. సోమవారం రైతుభరోసా నిధుల తగ్గింపును నిరసిస్తూ మండల కేంద్రంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

కోట్‌పల్లిలో పంట పొలాల్లో..

మండల కేంద్రంలోని పంట పొలాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం రూ.15 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంట్వారంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎగవేతల సర్కారుపై ఆగ్రహం

ధారూరు : రైతుభరోసా నిధుల తగ్గింపును నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు ర్యాలీని తీసి.. ధారూరు మెయిన్ రోడ్డులో గల అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎకరానికి రూ.15 వేల ఇస్తామని.. ఎన్నికల్లో ఓట్లు దండుకుని.. రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ ప్రకారం గతేడాది నుంచి ఇప్పటివరకు అంటే మూడు పంటలకు కలిసి ఎకరాకు రూ.17,500 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రాములు, అంజయ్య, సంతోష్‌కుమార్, యాత్రగౌడ్, రాజు, చంద్రమౌళి, శశిధర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, మహేశ్, అనంతయ్య, విజయ్‌కుమార్, నర్సింహులు, రాంరెడ్డి, రవి, వెంకట్‌రామ్‌రెడ్డి, నరేశ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిధుల్లో కోత తగదు

మర్పల్లి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రైతు భరోసా పథకంతో రూ.15వేలు అందించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపి..అనంతరం తహసీల్దార్ మునిరోద్దీన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుభరోసా నిధుల్లో కోత తగదని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు మోహన్‌రెడ్డి, అంజయ్యగౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్, యూత్ అధ్యక్షుడు మధుకర్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, మాజీ సర్పంచులు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు గౌస్, మిత్ర, సొహైల్, యాదయ్య, రవీందర్, నరేందర్ రెడ్డి, ఖాజా షరీఫ్, రాంచందర్, అలీం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ మునిరోద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆందోళన

కడ్తాల్ : పంట పెట్టుబడి సాయాన్ని ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలే ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా మండిపడ్డారు. రైతు భరోసా అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానివి అన్ని అబద్ధపు హామీలని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతు లతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నదన్నారు.

కాంగ్రెస్ అంటేనే అబద్ధాలు, దగా, మోసమని వారు దుయ్యబట్టారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి సమగ్రంగా అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, మాజీ సర్పంచ్‌లు యాద య్య, లోకేశ్‌నాయక్, నర్సింహాగౌడ్, సాయిలు, భూనాథ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రంగయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతు నాయకుడు నర్సింహ, బీఆర్ఎస్ అన్మాస్‌పల్లి గ్రామాధ్యక్షుడు మహేశ్ యాదవ్, నాయకులు వెంకటేశ్, రమేశ్, రవి, గణేశ్, రమణ, శ్రీను, అంజి, యాదయ్య, మల్లేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం
- పాల్గొన్న చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జనవరి 6 : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి హాజరయ్యారు. అనంతరం నూతన చైర్మన్‌గా సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా జంగయ్య, డైరెక్టర్లతో మార్కెటింగ్ శాఖ అధికారి రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా మండలంలోని తిమ్మారెడ్డిగూడలో రూ.5కోట్లతో ఈసీవాగుపై నిర్మించిన బ్రిడ్జి, ఏట్లఎర్రవల్లిలో రూ.5కోట్లతో చేపట్టనున్న బ్రిడ్జికి శంకుస్థాపన, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సర్దార్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందన్నారు. సాగు చేసే భూమికి రైతుభరోసా ఇవ్వాలని సీఎం నిర్ణయించినట్లు చెప్పారు. మొయినాబాద్‌లో నూతన మార్కెట్‌తోపాటు కొహెడ దగ్గర మెగా మార్కెట్‌ను ఏర్పాటు చేసి జిల్లాలోని రైతులకు భవిష్యత్తులో ఎలాంటి కష్టం లేకుండా చూస్తామన్నారు. రైతులు లాభాలొచ్చే పంటలు సాగు చేసుకోవాలని, వాటికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. రైతుల కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు రైతులకు అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోనే సర్దార్‌నగర్ మార్కెట్ పెద్ద మార్కెట్‌గా పేరుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, జేడీఏ నర్సింహారావు, ఏడీఏ సురేశ్ బాబు, పొల్యూషన్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మాణెయ్య, మాజీ సర్పంచులు అనితారెడ్డి, శకుంతల, నర్సింహులు, పాండు, సునీత, శేఖర్‌రెడ్డి, మల్లేశ్, మాధవరెడ్డి, శ్రీరాంరెడ్డి, రవీందర్, దర్శన్, ఆగిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, అక్తర్, భార్గవ్‌రామ్, నర్సింహులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి..

చేవెళ్ల టౌన్ : రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన డీసీఎంఎస్ గోదాం, దుకాణ సముదాయాలను స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ షాపులను రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత రైతుభరోసా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్, పెంటయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, మాజీ సర్పంచ్ శైలజ, నర్సింహులు, రాంచంద్రయ్య, ప్రభాకర్, జనార్దన్, నరేందర్, మాధవరెడ్డి, మాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

వికారాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు సంయుక్త కార్యదర్శులు, సహాయ అధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. –వికారాబాద్, జనవరి 6

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సత్వరమే పరిష్కరించాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 6 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజావాణికి 120 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్, ఆర్డీవోలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగారెడ్డిలో 52 ఫిర్యాదులు..

ఆదిబట్ల : ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. మొత్తం ఫిర్యాదులు 52 రాగా.. అందులో రెవెన్యూశాఖ–21, ఇతర శాఖలకు –31 వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ముగిసిన సురేశ్ మూడు రోజుల కస్టడీ

పీడీపీపీ కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : లగచర్ల ఘటనలో రైతులపై నమోదైన కేసులో రెండో నిందితుడిగా ఉన్న సురేశ్‌ను బొంరాస్‌పేట పోలీసులు సోమవారం కోర్టు ఎదుట హాజరుపర్చారు. అతడిని మూడురోజులపాటు విచారించిన పోలీసులు.. కస్టడీ సమయం ముగియడంతో ఉస్మానియా దవాఖానలో వైద్యపరీక్షలు నిర్వహించి సాయంత్రం ఐదు గంటలకు నాంపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి ఏసీబీ కోర్టు ఎదుట హాజరుపర్చారు. శనివారం నిందితుడి నుంచి పలు ప్రశ్నలకు సమాధానం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నిందితుడు తలదాచుకున్నట్టు ప్రాథమిక విచారణ ఆధారంగా తెలుసుకుని బల్కంపేట, కూకట్‌పల్లి తదితర ప్రాంతాలకు నిందితుడిని పోలీసు వాహనంలో తీసుకెళ్లి విచారించారు. సోమవారం పోలీసుల కార్యాలయంలోనే ప్రశ్నల రూపంలో వివరాలను సేకరించారు.

మాంగ్యానాయక్ కస్టడీ పిటిషన్ తిరస్కరణ..

ఈ కేసులో 70వ నిందితుడిగా రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్న మాంగ్యానాయక్‌ను కస్టడీకి అప్పగించాలని కోరుతూ బొంరాస్‌పేట పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ ను సోమవారం కోర్టు కొట్టివేసింది. సురేశ్‌తోపాటు మిగతా వారి బెయిల్ పిటిషన్లపై న్యాయవాదుల తరపున వాదనలు ముగిశాయి. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ దుర్గాజీ పోలీసుల తరపున వాదనల్ని వినిపించే అవకాశం ఉన్నది. తీర్పును గురువారానికి వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బెయిల్ పిటిషన్లపై తీర్పును రిజర్వు చేస్తూ గురువారానికి ఏసీబీ జడ్జి మహ్మద్ అక్తర్ అప్రోజ్ ఆదేశాలు జారీ చేశారు. సురేశ్ బెయిల్ పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది ఏకాంబరమ్ వాదనల్ని పూర్తి చేశారు. పీపీ వాదనల తర్వాత కోర్టు తీర్పు వెలువరించనున్నది. సురేశ్ 45 రోజులుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు

వికారాబాద్, జనవరి 6 : తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు జిల్లా మైనారిటీ శాఖ అధికారి హన్మంత్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రిస్టియన్ మైనారిటీ మహిళలు జనవరి 20లోపు ఆన్‌లైన్ TGOBMMS web: tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెల్లరేషన్, ఆహార భద్రతాకార్డు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు , పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు మించకుండా ఆదాయం ఉండాలన్నారు. కనీసం ఐదోతరగతి అర్హత సాధించడంతోపాటు 18 నుంచి 55 ఏండ్ల లోపు ఉండాలని, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి టైలరింగ్ నేర్చుకున్నట్లు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7993357103 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి

వికారాబాద్, జనవరి 6 : మాతాశిశు మరణాలను తగ్గించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది తగిన సూచనలు ఇవ్వాలని ఏఆర్ఎంఎంఏఎన్ సంస్థ వైద్యులు దేబాంజలి సహా, శ్వేత, సంతోషినిలు సూచించారు. సోమవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వికా రాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, మాతా శిశు సంరక్షణ ప్రో గ్రామ్ అధికారిణి డాక్టర్ పవిత్ర ఆధ్వర్యంలో మహవీర్ వైద్యకళాశాల ఆడిటోరియంలో జిల్లాలో పని చేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలకు సురక్షిత మాతృత్వం, నవజాత శిశు సంరక్షణపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల లు నిండకుండా ప్రసవం, హెచ్ఐవీ కలిగిన మహిళ డెలివరీ అయితే తీసు కోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రసూతి అనంతరం 42 రోజుల పాటు బాలింత, నవజాత శిశువు సంరక్షణ వంటి అంశాలపై జిల్లాలోని మహిళా ఆరోగ్య కార్యకర్తలకు ప్రాజెక్టర్ ద్వారా వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ జానీ, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, నాగమల్లేశ్వరరావు, రజిత హెల్త్ ఎడిటర్, జిల్లాలోని మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శిక్షకులు

శిక్షణకు హాజరైన వైద్య అధికారులు, సిబ్బంది

పసికందు మృతి

- వైద్యుడి నిర్లక్ష్యంతోనేనని కుటుంబీకుల ఆరోపణ
- డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు
- వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో ఘటన

వికారాబాద్, జనవరి 6 : వైద్యుడి నిర్లక్ష్యంతోనే పసికందు మృతి చెందాడని బాధిత కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. నవాబుపేట మండలంలోని మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భిక్షపతి, స్వప్న భార్యాభర్తలు. స్వప్న నిండు గర్భిణి కావడంతో ఈ నెల నాల్గో తేదీన వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు డెలివరీకి వచ్చింది. వైద్యులు ఆపరేషన్ చేయగా బాబు జన్మించాడు. ఆదివారం రాత్రి విధులు నిర్వహించిన డాక్టర్ అశోక్‌కుమార్ బాబును పరీక్షించి బాగానే ఉన్నాడని చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అయితే అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో బాబుకు ఎక్కిళ్లు రావడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. విధుల్లో ఉండాల్సిన డాక్టర్ అందుబాటులో లేరు. ఫోన్ చేస్తే వస్తున్నానని చెప్పారు. 4:30 గంటల ప్రాంతంలో డాక్టర్ వచ్చి చూడగా బాలుడిలో ఉలుకుపలుకు లేకపోవడంతో మృతి చెందాడని తల్లిదండ్రులకు చెప్పారు. ఆ చిన్నారిని అక్కడి నుంచి ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తే అరగంట ముందు చనిపోయాడని అక్కడి వైద్యులు చెప్పినట్లు బాధితులు తెలిపారు. సమయానికి డాక్టర్ వచ్చి ఉంటే మా బాబు బతికేవాడని.. డాక్టర్ నిర్లక్ష్యంతోనే చనిపోయాడని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వహించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాలుడి తల్లిదండ్రులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వికారాబాద్ దవాఖానకు సీఐ భీమ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని వివరాలు సేకరించారు.

ఈ విషయంపై దవాఖాన సూపరింటెండెంట్ స్పందిస్తూ.. చిన్నారి చనిపోయిన విషయం వాస్తవమేనని.. జిల్లా వైద్యాధికారులకు సమాచారం అందించామని వారి ఆదేశాల మేరకు డాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

చిన్నారి మృతి విషయాన్ని దవాఖాన సూపరింటెండెంట్‌కు వివరిస్తున్న తండ్రి భిక్షపతి